క్లుప్తంగా

కుళాయిలు చోరీ


పోలీసులు స్వాధీనం చేసుకున్న కుళాయిలు

హొళగుంద: చెత్త కాగితలు ఏరుకునే మహిళలు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుళాయిలను చోరీ చేశారు. మధ్యాహ్నం సమయంలో ముగ్గురు మహిళలు కళాశాల ఆవరణంలోకి వెళ్లి అక్కడ ఏర్పాటు చేసిన విలువైన 11 కుళాయిలను విప్పుకుని వెళ్లారు. కొద్ది సేపటికే అక్కడికెళ్లిన వాచ్‌మెన్ లక్ష్మన్న మహిళలను గుర్తించి పోలీసులుకు పట్టించాడు. పోలీసులు విచారించి మహిళల నుంచి కుళాయిలను స్వాధీనం చేసుకుని కళాశాల సిబ్బందికి అప్పజెప్పారు.

చురుగ్గా రోడ్డు పనులు


కొనసాగుతున్న తారురోడ్డు పనులు

హొళగుంద: హొళగుంద–మార్లమడికి రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు రోజుల క్రితమే పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో ఏళ్లుగా అధ్వానంగా ఉన్న రోడ్డులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 5.10 కి.మీ హొళగుంద–మార్లమడికి రోడ్డుకు గాను రెండు లైన్ల రహదారి(వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ కాలువ ముందు వరకు డబుల్ సీసీ రోడ్డు.. అక్కడి నుంచి తారురోడ్డు)గా మార్చేదుకు రూ.5.40 కోట్లు మంజూరయ్యాయి. పనులు పూర్తయితే తమకు రహదారి కష్టాలు తప్పుతాయని పలువురు పేర్కొన్నారు.

భక్తి శ్రద్ధలతో చందన యాత్ర ఉత్సవాలు


జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథుని మందిరంలో ఆదివారం జగన్నాథుని చందన యాత్ర మహోత్సవాలు –2024 అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లకు చందన సేవ, అలంకార సేవ, అభిషేక సేవ, సంపూర్ణ నైవేద్య సేవలు నిర్వహించారు. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు భక్తులకు సందేశమిచ్చారు. హరే నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఓటర్లు ఇబ్బందులు పడకుండా చర్యలు


పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయడానికి వచ్చే ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నామని ఎంపీడీఓ అలివేలమ్మ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల్లో ఓటర్లకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండాకాలం అయినందున ప్రతి బూత్‌లో షామియానాలు, నీటి వసతి ఏర్పాటు చేశామన్నారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఆమె వెంట వీఆర్వో రంగస్వామి ఉన్నారు.

ఘనంగా మాతృదినోత్సవం


బ్రహ్మ కుమారి కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మాతృదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఓం శాంతి ప్రజాపిత బ్రహ్మకుమారి కేంద్రంలో మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని మృత్యుమూర్తుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వారికి పాదాభి వందనం కార్యక్రమం నిర్వహించారు. భగవంతుడు సైతం మాతృమూర్తికి ప్రథమ స్థానం కల్పించారని ప్రజా పిత బ్రహ్మ కుమారి నిర్వాహకురాలు మాధవి, ఉషారాణి తెలిపారు. మన జన్మకు కారణమైన మాతృమూర్తులను వృద్ధాప్యంలో ప్రతిఒక్కరూ బాగా చూసుకోవాలని సూచించారు.

నేడే ఓట్ల పండుగ!

- పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల అధికారులు
- ఎన్నికల సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచన

ఓట్ల పండుగకు సర్వం సిద్ధమైంది. ఓటు వేసి తమ ఐదేళ్ల జీవితాన్ని అభ్యర్థుల చేతుల్లో పెట్టేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. ఎన్నికల సిబ్బంది కూడా సామగ్రితో పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం పత్తికొండ, ఆలూరు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు.

పత్తికొండ రూరల్: నియోజకవర్గ పరిధిలో సోమవారం జరిగే పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు చర్యలు తీసుకున్నారు. 291 మంది పీఓలు, 291 మంది ఏపీఓలు, 1,164 మంది ఓపీఓలను నియమించారు. వారు బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్‌లు, పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. 57 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి మైక్రో అబ్జర్వర్‌లను ఏర్పాటు చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో ఏడుగురు సీఐలు, 10 మంది ఎస్‌ఐలతో పాటు సివిల్, ఏఆర్, కర్ణాటక ఎస్ఎస్‌బీ, అస్సాం, గుజరాత్ సిబ్బంది, హోంగార్డులతో కలిపి 450 మంది పోలీసు సిబ్బందితో భద్రతాచర్యలు తీసుకున్నట్లు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


పత్తికొండ జూనియర్ కళాశాల వద్ద సిబ్బందికి విధులు కేటాయిస్తున్న ఆర్‌ఓ


తండ్రి ఒడిలో ఆదమరచి నిదురపోతున్న చిన్నారి

ఆలూరులో..

ఆలూరు: స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగి పంపిణీ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలివెళ్లారు. నియోజకవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీఓ, ఏపీఓ, ఓపీలు తమకు కేటాయించిన ఎన్నికల సామగ్రిని తీసుకుని సాయంత్రానికి ఆర్టీసీ బస్సుల్లో వారివారి కేంద్రాలకు చేరుకున్నారు.


పోలింగ్ కేంద్రాలకు ఈవీఎం మిషన్‌లను తీసుకెళ్తున్న సిబ్బంది

పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి

పత్తికొండ, తుగ్గలి, మద్దికెర, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో 2,23,605 ఓటర్లు ఉన్నారు. వీరికి 205 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఓటర్లకు క్యూలైన్‌లను ఏర్పాటు చేశాం. సమస్యలు తలెత్తితే హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుంది. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకోవచ్చు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకున్నాం.

– ఆర్డీఓ నీలపు రామలక్ష్మి, పత్తికొండ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి

పత్తికొండ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్ స్టేషన్లు	పోలింగ్ స్టేషన్‌లనెంబర్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
పత్తికొండ	68	1 నుంచి 17 మరియు 52 నుంచి 102	28055	28900	9	56964
మద్దికెర	34	18 నుంచి 51	14559	15030	3	29592
తుగ్గలి	55	103 నుంచి 157	24811	24499	6	49316
కృష్ణగిరి	40	158 నుంచి 193 మరియు 198 నుంచి 201	18594	18181	0	36775
వెల్దుర్తి	58	194 నుంచి 197 మరియు 202 నుంచి 255	25584	25368	4	50956
మొత్తం	255		111603	111978	22	223605

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్లు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఆలూరు	21,754	22,022	15	43,791
ఆస్పరి	26,723	26,094	4	52,821
చిప్పగిరి	12,354	12,413	5	24,772
దేవనకొండ	29,719	28,638	2	58,359
హాలహర్వి	17,944	18,352	11	36,307
హొళగుంద	21,589	21,342	16	42,947
మొత్తం	1,30,083	128,861	53	2,58,997


ఆలూరు జూనియర్ కళాశాల నుంచి ఈవీఎంలను పోలింగ్ బూత్‌లకు తీసుకెళ్తున్న అధికారులు

ఓటు హక్కును వినియోగించుకోండి


ఎమ్మెల్యే శ్రీదేవి

పత్తికొండ టౌన్: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ బాధ్యతగా వినియోగించుకోవాలని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. మేలైన సమాజాన్ని కోరుకుంటున్న ప్రతి ఒక్కరూ తమకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు.

స్వేచ్ఛగా ఓటు వేయండి


సురేంద్రరెడ్డి

దేవనకొండ: ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్లు సురేంద్రరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మంచి నాయకుడికి ఓటు వేసి, మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలన్నారు.

చెట్టు విలువ!



మహానంది: మండుతున్న ఎండలకు జనం అల్లాడుతున్నారు. చెట్లను ఇష్టానుసారం నరికివేడంతో పర్యావరణం దెబ్బతినడంతో వేసవితాపం ఎక్కువైంది. పొలాల్లో మేతకు వెళ్లిన గొర్రెల మంద ఎండలకు తట్టుకోలేక గుంపుగా ఓ చెట్టు కింద సేదతీరుతున్న దృశ్యం చెట్టు విలువను చెప్పకనే చెబుతుంది. మహానంది సమీపంలో దృశ్యం కనిపించింది.

వైభవంగా శంకర జయంతి

ఆదోని అర్బన్: పట్టణంలోని తిరుమల నగర్‌లో శారదా శంకరమఠంలో అశేష జనవాహిని మధ్య శంకర జయంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 121 మార్లు రుద్రాభిషేకం, 12 విశేష ద్రవ్యాలతో అభిషేకం, రుద్రహోమం, గురుపాద పూజ నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం పురవీధులగుండా శంకరాచార్య వారి నూతన విగ్రహాన్ని ఊరేగింపు చేశారు.

ప్రజాస్వామ్య పండుగ.. మది నిండుగా

- ఆకర్షణీయంగా పోలింగ్ కేంద్రాలు
- స్వాగత తోరణాలు, రంగురంగుల బెలూన్లు, విద్యుద్దీకతో తీర్చిదిద్దిన అధికారులు



వెల్దుర్తి మండలం అల్లుగుండు గ్రామంలోని మోడల్ పోలింగ్ బూత్‌లో అలంకరణ, స్వాగత దృశ్యాలు

కృష్ణగిరి: గ్రామాలు ప్రజాస్వామ్య పండుగకు సిద్ధమయ్యాయి. పోలింగ్ కేంద్రాలు ఓటర్లకు స్వాగతం పలుకుతున్నాయి. వెల్దుర్తి, కృష్ణగిరి మండలాలల్లోని మూడు మోడల్ పోలింగ్ బూత్‌లను ఆయా బూత్ లెవల్ ఆఫీసర్లు, రెవెన్యూ అధికారులు ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. వెల్దుర్తి హైస్కూల్‌లోని 208 బూత్, అల్లుగుండు 203 బూత్, కృష్ణగిరిలోని 184 బూత్‌లను స్వాగత తోరణాలు, రంగు రంగుల బెలూన్లు, కార్పెట్లు, ముగ్గులతో అలంకరించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద కలెక్టర్ ఎన్నికల ఆహ్వాన పత్రిక ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

➡ మద్దికెర: గతంలో పోలింగ్‌బూత్‌లు బారికేట్లు, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఎండలకు మాడుతూ, తాగేందుకు నీరు లేక ఓటర్లు తమ ఓటు హక్కును వేసేందుకు ఇబ్బందులు పడేవారు. కానీ ఈసారి ఎన్నికలను ప్రతిష్టాత్మంగా భావించిన కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సృజనా మండలానికో ఆదర్శ పోలింగ్‌బూత్‌ను ఏర్పాటుచేసి అందంగా తీర్చిదిదేలా చర్యలు తీసుకున్నారు. మద్దికెర జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మోడల్ పోలింగ్‌బూత్‌ను ఏర్పాటు చేశారు. విద్యుదీకరణతో బూత్ ఓటర్లను ఆకట్టుకుంటోంది.

➡ దేవనకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆదర్శ పోలింగ్ కేంద్రంగా తీర్చిదిద్దారు. ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ జి.సృజనతో కూడిన బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిఒక్కరూ సోమవారం ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రజలకు ఎన్నికల అధికారులు సూచించారు.

ఆస్పరి: మండల కేంద్రవలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన 190వ పోలింగ్ కేంద్రం ఓటర్లను ఆకర్షిస్తోంది. ఆహ్వాన ఫ్లెక్సీ, టెంకాయ మట్టలతో స్వాగత తోరణాలను ఏర్పాటు చేశారు. మండలంలో ఓటర్లుకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తెలిపారు.


వెల్దుర్తిలో ఏర్పాటు చేసిన కలెక్టర్ ఆహ్వాన ఫ్లెక్సీ


మద్దికెరలోని ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన పోలింగ్‌బూత్


దేవనకొండలో ముస్తాబు చేసిన పోలింగ్ కేంద్రం

పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

- ఎలక్షన్ స్పెషల్ అబ్జర్వర్ తారిఖ్ అలీ

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేక పరిశీలకులు మీర్ తారిఖ్ అలీ అధికారులను సూచించారు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగి పంపిణీ కార్యక్రమాన్ని ట్రైనీ కలెక్టర్ కల్యాణితో కలిసి ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆర్‌ఓ రాము నాయక్‌ను ఆదేశించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాలన్నారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు వస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సెక్టోరల్ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఓటు హక్కు ఉన్న వారికి ఓటరు కార్డు లేకున్నా 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు ఉన్నా ఓటు వేసేందుకు అనుమతించాలని సూచించారు. ఆయన వెంట ఈఆర్వో చంద్రశేఖర్, డీటీలు రజనీకాంత్ రెడ్డి, గుండాల్ నాయక్ ఉన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న ఎలక్షన్ స్పెషల్ అబ్జర్వర్ మీర్ తారిఖ్ అలీ

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: గోతులదొడ్డి, ఉప్పరహాల్ గ్రామాల్లో ఆదివారం సెబ్ పోలీసులు దాడులు చేయగా 18 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సెబ్ సీఐ విన్నీలత విలేకరులకు తెలిపారు. మోటార్ సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు అక్రమంగా 18 బాక్సుల(1728 టెట్రా ప్యాకెట్లు) కర్ణాటక మద్యం తరలిస్తుండగా దాడులు చేశామన్నారు. అలాగే ఆదోని పట్టణంలో 20 లీటర్ల నాటుసారాను సీజ్ చేసి వెంకటేష్, జాతెప్ప, నరసింహులు, గుంటమ్మ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.


పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ విన్నీలత

రిసెప్షన్ సెంటర్లలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయండి

- నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్/ఎన్నికల అధికారి సృజన ఆదేశం

కర్నూలు (సెంట్రల్) : రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లకు పోలింగ్ అనంతరం వచ్చే పోలింగ్ సిబ్బందికి ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్/ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన నోడల్ అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అన్ని నియోజకవర్గాల రిసెప్షన్ సెంటర్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రిసెప్షన్ సెంటర్లకు వచ్చే పోలింగ్ సిబ్బందికి ప్రతి మూడు గంటలకు ఒకసారి భోజనం వండి అందజేయాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చేందుకు బ్యాచుల వారీగా హమాలీలను సోమవారం సాయంత్రం నాటికి ఏర్పాటు చేసుకోవడంతో పాటు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేకమైన టీషర్టు అందజేయాలని సివిల్ సప్లయిస్ డీఎంను కలెక్టర్‌ను ఆదేశించారు. పార్కింగ్ దగ్గర తాత్కాలిక టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్లలో డేటా ఎంట్రీ చేసుకోవడానికి ఇంటర్నెట్/వైఫై హాట్ స్పాట్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లో ఉన్న కంట్రోల్ రూమ్‌లో నిరంతరం ఫీడ్ ఉండేలా చూడాలన్నారు. జూన్ 4వ తేదీ వరకు విద్యుత్ అంతరాయం లేకుండా 3 స్ట్రాంగ్ రూమ్‌ల కెమెరాల దృశ్యాల లైవ్ ఫీడ్ నిరంతరం రికార్డు అయ్యేలా పవర్ బ్యాక్ అప్/జనరేటర్/యూపీఎస్ ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్ సిబ్బంది కోసం ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని డీఆర్‌ఓను ఆదేశించారు. నోడల్ అధికారులు రిసెప్షన్ సెంటర్లలో అందుబాటులో ఉంటూ రిటర్నింగ్ అధికారులకు తగిన సహాయ సహకారాలు అందజేయాలన్నారు. పార్కింగ్ దగ్గరే బారికేడ్లు ఏర్పాటు చేసి పోలింగ్ సామగ్రి తీసుకొచ్చే ఏపీఓ, పీఓలు మాత్రమే లోనికి అనుమతించి, మిగతా సిబ్బందిని పార్కింగ్ ప్రదేశం దగ్గరే నిలువరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్ రావు, జిల్లాపరిషత్ సీఈఓ నాసరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, కుడా వైస్ చైర్మన్ సూర్యప్రతాప్ నారాయణరెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, సివిల్ సప్లయ్ డీఎం షర్మిల, డీఎస్ఓ మూర్తి, హౌసింగ్ పీడీ సిద్దలింగమూర్తి, డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి, డీటీసీ శ్రీధర్, ఏపీఐఐసీ జెడ్ఎం సోమశేఖర్‌రెడ్డి, మెప్మా పీడీ నాగశివలీల, మైనార్టీ సంక్షేమ అధికారి సునిల్ ఖన్నా, టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, కార్మిక శాఖ అధికారి తదితరులు పాల్గొన్నారు.


రాయలసీమ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన, ఎస్పీ


7 గంటలకు పోలింగ్ మొదలు కావాలి

- ఎలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకోవాలి
- ఎన్నికల అధికారులతో జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు (సెంట్రల్) : నేటి (సోమవారం)ఉదయం 7 గంటలకు పోలింగ్ ఖచ్చితంగా మొదలు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఆదివారం రాత్రి పోలింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎంపీడీఓ, నోడల్ అధికారులు, సెక్టార్ అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయం 5:30 గంటలకు మాక్ పోల్ మొదలుపెట్టి 6:30 గంటలకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత మాక్ పోల్‌లోని ఓట్లను తొలగించి 6:45కు కంపార్ట్‌మెంట్లలో మిషన్లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సెక్టార్ ఆఫీసర్లు ఆదివారం రాత్రి అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి పోలింగ్ స్టేషన్ ఈవీఎం ఎలా కనెక్ట్ చేయాలి, మాక్‌పోల్ నిర్వహణపై వీడియోలు చూసి రిఫ్రెష్ అయ్యేలా పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇవ్వాలన్నారు. సెక్టార్ ఆఫీసర్లు నేటి ఉదయం 7 గంటలకే అన్ని పోలింగ్ స్టేషన్లకు వెళ్లి అన్ని మిషన్లు పనిచేస్తున్నాయా లేదా అని తెలుసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, సెక్టార్ ఆఫీసర్లు ఏదో ఒక పోలింగ్ స్టేషన్‌లో మాక్ పోల్‌కు హాజరు కావాలని ఆదేశించారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతానికి సంబంధించిన నివేదికలను పంపాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ నిర్వహణలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి

డోన్ టౌన్ : కుల వివక్షను రూపుమాపేందుకు కృషి చేసిన జగద్గురు ఆది శంకరచార్యులు, భగవత్ శ్రీరామనుజం జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక పాత బస్టాండ్‌లో వీహెచ్‌పీ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. సాయంత్రం రాముల దేవాలయంలో తత్సంగం నిర్వహించారు. ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి రామరాజేష్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తిమ్మారెడ్డి, శివశంకర్, కార్యదర్శి నరేష్, ప్రముక్ శ్రీరామ్, భజరంగ్‌దళ్ సంపర్క్ కృష్ణారావు, దుర్గావాహిని విభాగ్ ప్రముక్ భవానీ, ఏబీవీపీ కార్యదర్శి రాజశేఖర్, సభ్యులు శ్రీనివాసులు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.


మజ్జిగ పంపిణీ చేస్తున్న వీహెచ్‌పీ సభ్యులు